క్లుప్తంగా

రేపు మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవికి ఎన్నిక


నాగాయలంక: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు నాగాయలంక మండల పరిషత్ పాలకవర్గంలో ఖాళీగా ఉన్న ఒక ఉపాధ్యక్ష పదవికి 16న ఎన్నిక నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి ఎ.నాగరాజు ప్రకటన విడదల చేశారు. వివరాలను ఏఓ కె.ఎం.చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. ఎన్నికైన మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులచే కార్యాలయంలో ఉదయం 11గంటలకు జరిగే ప్రత్యేక సమావేశంలో ఒక ఉపాధ్యక్షుడి పదవికి ఎన్నిక జరుగుతుందన్నారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం ఆయా పార్టీలు ఎవరికైనా విప్ జారీ చేస్తే ఆ వివరాలను 15వ తేదీ 11గంటలలోపు, ఫారం ఎ లేదా బీ ద్వారా 16వ తేదీ ఉదయం 11గంటల లోపు ప్రిసైడింగ్ అధికారికి అందజేయాలని సూచించినట్లు పేర్కొన్నారు. మండల పరిషత్ పాలకవర్గంలో ఇద్దరు ఉపాధ్యక్షులు ఉండగా వారిలో ఒకరైన భావదేవరపల్లి ఎంపీటీసీ సభ్యుడు పరిశె అమ్మన్న మరణించారు. దీంతో ప్రస్తుతం ఆ స్థానం భర్తీ చేయడానికి ఈ ఉపాధ్యక్ష ఎన్నిక జరుగనుంది.

స్వామివారి నిత్యాన్నదాన పథకానికి వితరణ



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి నిత్యాన్నదాన పథకానికి విజయవాడ వాస్తవ్యులు బి.రాశి హర్షిణి రూ.50,116 విరాళంగా సమర్పించుకున్నారు. ఉదయం ఆలయానికి వచ్చిన వారు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించుకున్నారు. అనంతరం ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద రావుకు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

12వ నంబర్ కాలువకు సాగునీరు విడుదల



సాక్షి ఎఫెక్ట్

మోపిదేవి: ఎట్టకేలకు మండలంలో 12వ నంబర్ కాలువకు సోమవారం సాగు నీరు విడుదల చేశారు. ఈనెల 13వ తేదీ ఆదివారం సాక్షి దినపత్రికలో 'ఎండిపోతున్న నారుమడులు' అనే శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఇరిగేషన్‌శాఖ అధికారులు వెంటనే సైఫన్ వద్ద పడిన గుంతలు కాంక్రీటుతో పూడ్చించారు. కాలువ చివరి భూములకు సాగునీరు విడుదల చేశారు. దీంతోపాటు 12వ నంబర్ కాలువ ప్రారంభంలో సాగునీటికి అడ్డుగా నిలిచిన తూటికాడ, గుర్రపుడెక్క, చెత్తను తొలగించారు. సాగునీరు విడుదల చేయడంపై ఆ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తూ సాక్షికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు చేయాలని ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల కాలేజీలో ఇంగ్లిష్, లెక్కలు, హిస్టరీ, సివిక్స్, కామర్స్ (ఒకేషనల్), షార్ట్‌హ్యాండ్, టైపు (ఒకేషనల్) సబ్జెక్టులలో బోధించే అధ్యాపకులు బదిలీ అయ్యారు. ఈ సబ్జెక్టులను బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ పోస్టులకు 50 శాతం మార్కులతో గుర్తింపు పొందిన యూనివర్శిటీల నుంచి అర్హత సర్టిఫికెట్లు పొందిన అభ్యర్థులు ఈ నెల16వ తేదీ సాయంత్రం లోపు కాలేజీలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఈ నెల 16న ఉదయం 10 గంటలకు ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

హారికకు ఎంపీపీల పరామర్శ



పెడన: ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాము దంపతులపై మూడు రోజులు కిందట జరిగిన దాడి నేపథ్యంలో హారికను పలువురు ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పరామర్శించి ధైర్యం చెప్పారు. హారికను కలిసి పరామర్శించిన వారిలో పెడన ఎంపీపీ రాజులపాటి వాణి, జి.కొండూరు ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, సర్పంచులు మండల అరుణ, నాయుడు ఉదయలక్ష్మి, ఎంపీటీసీ విజయలక్ష్మి, మండలి హనుమంతరావు, మచిలీపట్నం మాజీ ఫ్లోర్ లీడర్ అచ్చాబా, విశ్రాంత డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్ తదితరులు ఉన్నారు.

శుద్ధి జల ప్లాంట్లపై నీలినీడలు

- మురుగునీటిని శుద్ధి జలం చేసే ప్లాంట్లు నిర్మాణమయ్యేనా?
- పట్టణంలో మూడు శుద్ధి జల ప్లాంట్ల నిర్మాణానికి అక్టోబర్‌లో గ్రీన్ సిగ్నల్
- అనువైన ప్రైవేటు స్థలాలను పరిశీలించిన రెవెన్యూ, మున్సిపల్ అధికారులు
- తాజాగా ప్రభుత్వ స్థలాలను చూడాలన్న ప్రభుత్వం
- ప్లాంట్ల నిర్మాణంపై నీలినీడలు



ప్రైవేటు స్థలాలను పరిశీలిస్తున్న రెవెన్యూ, మున్సిపల్ అధికారులు (ఫైల్)

పెడన: పట్టణంలో మురుగునీరు పంట కాలువల్లో కలుస్తోందని ఫిర్యాదులు వెల్లువెత్తిన నేపథ్యంలో మురుగునీటిని శుద్ధి చేసే ప్లాంట్లను నిర్మించతలపెట్టారు. ప్రభుత్వ తీరుతో వీటి నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

ప్రభుత్వ స్థలాలు ఉంటేనేనా?

రాష్ట్ర ఖజానా అంతంత మాత్రంగానే ఉండటంతో ప్రైవేటు స్థలాలు కొనుగోలు చేసి నిర్మించే పరిస్థితి లేదని, ప్రభుత్వ స్థలాలుంటే చూడాలనే సంకేతాలు వచ్చినట్లుగా సమాచారం. ఈ నేపథ్యంలో వీటి నిర్మాణం ఇప్పట్లో జరిగే పరిస్థితి కనిపించడం లేదు. అదీ కాకుండా అనువైన ప్రభుత్వ స్థలాలు కానరాని పరిస్థితి. అధికారులు మాత్రం చూస్తున్నామని చెబుతున్నారే తప్ప అవి లేవనే విషయాన్ని బయటకు చెప్పలేని దుస్థితి.

మూడు చోట్ల స్థలాలను గుర్తించినా..

సీ వేజ్ ట్రీట్‌మెంట్ వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులను స్వచ్ఛత కార్పొరేషన్ వారికి ఎన్డీయే కూటమి అప్పగించింది. దీంతో వీరు మున్సిపల్ అధికారులను, రెవెన్యూ అధికారులను సంప్రదించడంతో గత ఏడాది ఆగస్టు నుంచి స్థలాలను పరిశీలించి అక్టోబరులో అనువైన స్థలాలను ఫైనల్ చేశారు. గుడివాడ రోడ్డులోని తామర చెరువు, తోటమూలలోని జెడ్పీహెచ్ఎస్ సమీపంలోను, పెడన– మచిలీపట్నం బైపాస్ రోడ్డులోని ఫ్లైఓవర్ సమీపంలో స్థలాలను పరిశీలించి అనువుగా ఉన్నాయని తేల్చారు. వీటిని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తమ తమ పరిధిలోని సర్వేయర్లతో క్షుణ్ణంగా పరిశీలించి ఆయా స్థలాలు ఎవరికి చెందినవో గుర్తించి నివేదికలను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించారు.

ప్రైవేటు స్థలాలు వద్దంటూ..

సీ వేజ్ ట్రీట్‌మెంట్ వాటర్ ప్లాంట్(మురుగునీటిని శుద్ధి చేసే ప్లాంటు)లు మూడు నిర్మించాలి. వేర్వేరు ప్రాంతాలలో మూడు నిర్మించడానికి స్వచ్ఛత కార్పొరేషన్ వద్ద రూ.3.50 కోట్లు నిధులు సిద్ధంగా ఉన్నాయి. వాస్తవంగా రూ.4.50 కోట్లు వ్యయం అవుతుందని అంచనా. స్థల సేకరణకు ముందుగా నిధులు విడుదల చేసి కొనుగోలు చేయాల్సి ఉంది. తామర చెరువు వద్ద 0.96 సెంట్లు, పెడన– మచిలీపట్నం బైపాస్ రోడ్డులో 0.64 సెంట్లు, తోటమూల వద్ద 0.17 సెంట్లు స్థలాలను కొనుగోలు చేయాలని నివేదికలు పంపారు. ఈ స్థలాల ధర మార్కెట్‌ధరకు రెట్టింపు చెల్లించాల్సి ఉంది. దీంతో అంత పెట్టుబడి పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా లేనట్లుగా తెలుస్తోంది.

ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నడుచుకుంటాం



సీ వేజ్ ట్రీట్‌మెంట్ వాటర్ ప్లాంట్‌లను స్వచ్ఛత కార్పొరేషన్ వారు నిర్మించి మున్సిపాలిటీకి అప్పగించాల్సి ఉంది. అయితే ప్రభుత్వ స్థలాలను చూడాలని మౌఖికంగా తెలియజేశారే తప్ప లిఖితపూర్వకంగా అయితే ఎటువంటి ఆదేశాలు రాలేదు. ప్రైవేటు స్థలాలు కొనుగోలు చేయాలంటే అందుకు సిద్ధంగా స్థలాలు ఉన్నాయి. స్థానికంగా ప్లాంట్లు నిర్మాణానికి సంబంధించిన స్థలాల నివేదికలను సీఎండీ, ఎంయూఏడీలలోని ఉన్నతాధికారులకు పంపించడం జరిగింది. వారి నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం నడుచుకుంటాం.

– ఎల్.చంద్రశేఖరరెడ్డి, కమిషనర్, పురపాలక సంఘం, పెడన

గౌడ బిడ్డపై దాడి హేయమైన చర్య

- న్యాయం జరగకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తాం
- రాష్ట్ర గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టా వీరబాబు గౌడ్



మాట్లాడుతున్న రాష్ట్ర గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వీరబాబు గౌడ్ తదితరులు

పెడన: ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్, గౌడ బిడ్డ అయిన ఉప్పాల హారికపై దాడి చాలా హేయమైన చర్యని గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టా వీరబాబు గౌడ్ అన్నారు. సోమవారం ఆయన సంఘ నాయకులతో కలిసి కృష్ణా జిల్లా పెడన మండలం కృష్ణాపురంలోని హారికను వారి నివాసంలో కలిసి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు చెందిన ఉప్పాల హారికపై దాడి చాలా దారుణమన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రథమ పౌరురాలికే రక్షణ లేకపోతే రాష్ట్రంలో ఎవరికి రక్షణ ఉంటుందని ప్రశ్నించారు. మహిళలు తప్పిపోయినా, దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్న చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లు ఏం చేస్తున్నారన్నారు. ఓసీ జనరల్ కేటగిరిలో బీసీలకు సముచిత స్థానం కల్పించి బీసీ మహిళకు జెడ్పీచైర్‌పర్సన్ సీటు ఇచ్చారని, ఇది గిట్టని వారు, జీర్ణించుకోలేని వారు చేసిన దాడి ఇదన్నారు. బీసీ సంఘాల నాయకులు మేల్కొని మద్దతు తెలియజేయాలని, పదవుల కోసమే సంఘాలను అడ్డుపెట్టుకుని ఉంటే పద్ధతి కాదని, తక్షణం బీసీ మహిళపై దాడిని బీసీ సంఘాలు ఖండించాలని డిమాండ్ చేశారు. పదవులకు రాజీనామాలు చేసి వస్తే పోరాటాలకు సిద్ధంగా ఉన్నామన్నారు. బీసీ మహిళ అయిన హారికకు పూర్తి మద్దతు ఇస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ, జిల్లా ముఖ్య కేంద్రాల్లో నిరసన తెలియజేస్తామని ప్రకటించారు. ఈయనతో పాటు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యార్లగడ్డ గోవర్ధనరావు, గీత కార్మిక సంఘం నాయకుడు జోగి స్వాములు, రాజులపాటి శివబ్రహ్మేశ్వర తదితరులున్నారు.

అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ



పెదప్రోలు ప్రధాన సెంటర్ నుంచి బయలుదేరిన ఆషాఢ సారె

పెదప్రోలు(మోపిదేవి): మండలంలోని పెదప్రోలులో కొలువుతీరిన శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారికి భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. సోమవారం సాయంత్రం సామూహికంగా మహిళలు ప్రధాన సెంటర్‌లో గంగానమ్మ అమ్మవారిని దర్శించుకుని అక్కడ నుంచి మేళతాళాలతో ఊరేగింపుతో ర్యాలీగా శ్రీ అద్దంకి నాంచారమ్మ ఆలయానికి చేరుకుని సారె సమర్పించుకున్నారు. పెద్ద ఎత్తున మహిళా భక్తులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి కూరపాటి కోటేశ్వరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముగిసిన శాకంబరీ ఉత్సవాలు

బంటుమిల్లి: మండల పరిధిలో అమ్మవార్లకు గత రెండు రోజులుగా జరుగుతున్న శాకంబరీ ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. పెదతుమ్మిడి గ్రామంలోని శ్రీ పార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శ్రీ పార్వతిదేవీ అమ్మవారి ప్రధాన మూర్తిని పలు రకాల కూరగాయలతో శాకంబరీదేవిగా అలంకరించి సారె సమర్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మట్టా నాగబాబు, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ మట్టా విజయలక్ష్మి, కోశాధికారి జల్లూరి శరభయ్య పలువురు దంపతులు, భక్తులు పాల్గొన్నారు. అర్చకులు సోమశేఖరపల్లి శ్రావణ్ కుమార్ వేద మంత్రాల మధ్య అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. చోరంపూడి గ్రామంలో గ్రామదేవత వీర్లవెంకమ్మదేవిని పలు రాకాల కూరలతో అలంకరించి పండితులు శంకర్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, పెద్దలు, భక్తులు పాల్గొన్నారు. ఈ కూరలను భక్తులకు పంచిపెట్టారు. బంటుమిల్లిలో శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి శాఖంబరీ పూజలు ముగిశాయి. ఆలయ ట్రస్టీ గరికపాటి కూనారావు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



శశాంక్‌బాబుకు చెక్కు అందజేస్తున్న ఐవీఎం డైరెక్టర్ వేములపల్లి సురేష్, రోజా దంపతులు

చల్లపల్లి: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న నిరుపేద యువకుడికి ఆర్థిక సహాయం అందించారు ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ (ఐవీఎం) డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్, రోజా దంపతులు. మోపిదేవి మండల పరిధిలోని పెదప్రోలు గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ శశాంక్‌బాబుకు బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. సంవత్సరం క్రితం తండ్రి మరణించటంతో తల్లితో కలిసి పాగోలు గ్రామంలో అమ్మమ్మ ఇంటివద్ద ఉంటున్నాడు. శశాంక్‌బాబు ఆరోగ్య, ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న పురిటిగడ్డకు చెందిన ఐవీఎం అధినేత సురేష్, రోజా దంపతులు స్పందించారు. రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని సోమవారం శశాంక్‌బాబుకు అందజేశారు. సురేష్, రోజా దంబపతులకు శశాంక్ బాబు, తల్లి స్వప్న కృతజ్ఞతలు తెలిపారు.

సుబ్రహ్మణ్యుని సేవలో సిక్కిం మాజీ గవర్నర్ సతీమణి



స్వామివారి చిత్రపటం అందుకుంటున్న మాజీ గవర్నర్ సతీమణి

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని సిక్కిం మాజీ గవర్నర్ వి.రామారావు సతీమణి సోమవారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి వారి కుమారుడు, కుటుంబ సభ్యులతో చేరుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన వారు నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, లడ్డూప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్వారైతు మల్లి భౌతికకాయానికి మాజీ మంత్రి నివాళి



అవనిగడ్డ: ఆక్వారైతు మాదివాడ మల్లి అలియాస్ పూసల మల్లి (65) భౌతిక కాయానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని), మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు నివాళులర్పించారు. వేకనూరుకు చెందిన మల్లి మచిలీపట్నంలో నివాసం ఉంటూ ఆక్వారైతుగా గుర్తింపు పొందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మల్లి మచిలీపట్నం వైద్యశాలలో సోమవారం మరణించారు. స్వగ్రామమైన వేకనూరుకు మల్లి భౌతిక కాయాన్ని తరలించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మాజీ మంత్రి పేర్ని, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి మల్లి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కాలువలో వ్యాన్ బోల్తా

కృత్తివెన్ను: బంటుమిల్లి లక్ష్మీపురం పంటకాల్వలోకి మినీవ్యాన్ దూసుకుపోయిన ఘటన సోమవారం కృత్తివెన్ను సమీపంలో జరిగింది. ఒంగోలు నుంచి అత్తిలికి రొయ్యపిల్లల సీడ్ వేసుకుని మినీవ్యాన్ వెళ్తుండగా చిన్నగట్టు సమీపంలో ముగ్గురు వ్యక్తులు రోడ్డుకు అడ్డురావడంతో డ్రైవర్ వారిని తప్పించే ప్రయత్నంలో సమీపంలోనిపంటకాల్వలోకి దూసుకుపోయింది. వాహనంలో డ్రైవర్, మరో వ్యక్తి ఉన్నారు. ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. సీడ్‌ను మరో వాహనంలోకి మార్చుకుని తీసుకెళ్లారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

పెడన: మండల పరిధిలోని జింజేరు గ్రామ సమీపంలో కొబ్బరితోటలో పేకాడుతున్న వారిపై మచిలీపట్నం స్పెషల్ పార్టీ దాడులు చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. సోమవారం ఈ దాడులు చేసిన సమయంలో ఆరుగురిలో ఒకరు పరారయ్యారు. అదుపులోకి తీసుకున్న వారి నుంచి రూ.4 వేలను స్వాధీనం చేసుకున్నారు. జూదరులను పెడన పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

మోపిదేవి: ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక రాము దంపతులపై కొందరు టీడీపీ, జనసేన నాయకుల గూండాల దాడికి నిరసనగా మోపిదేవి ప్రధాన సెంటర్లో సోమవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. శనివారం గుడివాడ సమీపంలో కొందరు కూటమి గూండాలు, అల్లరి మూకలు ఉన్మాదులుగా ప్రవర్తిస్తూ వ్యక్తిగత దూషణలు చేస్తూ, కారుని ధ్వంసం చేసి భౌతిక దాడికి పాల్పడిన సంఘటనపై వైఎస్సార్ సీపీ నాయకలు, మండల బీసీ సంఘాల నాయకులు ఈ ర్యాలీలో పాల్గొని నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి దాడి చేసిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని పోలీసులకు వినతిపత్రం అందజేశారు. చల్లపల్లి జెడ్పీటీసీ రాజులపాటి కళ్యాణి, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ రాజులపాటి శివప్రసాద్, మండల బీసీ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరావు, జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, రాష్ట్ర ముస్లిం మైనార్టీ నాయకులు పఠాన్ కరిముల్లాఖాన్, చోడాబత్తిన పూర్ణ చంద్రరావు, కారుమూరి శివనాగరాజు, ఆది, రెడ్రౌతు రాంప్రసాద్, తలపుల సుధాకర్, కొండేటి వాసు, కారుమూరి నాగేంద్రబాబు, తాతా శ్రీనివాసరావు, లింగం జగదీష్‌కుమార్, బండారు సూరిబాబు, గౌరిపర్తి రవి కాంత్ యాదవ్, పండలనేని శివప్రసాద్, సర్పంచ్ చింతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మోపిదేవి పోలీస్ స్టేషన్‌లో వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రైతులకు సాగునీరు అందించి ఆదుకోండి

కలెక్టర్ డీకే బాలాజీకి వినతిపత్రం అందజేసిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిట్టు, రైతులు



కలెక్టర్ డీకే బాలాజీకి వినతిపత్రం ఇస్తున్న పేర్ని కిట్టు, రైతులు

చిలకలపూడి(మచిలీపట్నం): రైతులకు సాగునీరు అందించి ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలోని రైతులతో కలిసి కలెక్టర్ డీకే బాలాజీకి సోమవారం వినితపత్రం అందజేశారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో తాను పర్యటించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించామన్నారు. ఆ సమస్యలను కలెక్టర్‌కు వివరించినట్టు తెలిపారు. మచిలీపట్నం నార్త్ మండలంలోని తాళ్లపాలెం, కానూరు, బుద్దాలపాలెం, పొట్లపాలెం, బొర్రపోతుపాలెం, గోకవరం తదితర గ్రామాల్లో తాను పర్యటించినప్పుడు రైతుల పొలాల్లో చుక్కనీరు లేదని, కాలువలకు నీరురాకపోవటం, పంటలు ఎండిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రామరాజు చానల్ నుంచి మచిలీపట్నం నార్త్ మండలానికి సాగు చేస్తున్న 16 వేల ఎకరాల ఆయకట్టుకు, రైవస్ చానల్ నుంచి బంటుమిల్లి కాలువ ద్వారా బందరు మండలంలోని పెదపట్నం గ్రామానికి సంబంధించి 900 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉండగా ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ సాగునీటి కాలువల పూడికతీత కార్యక్రమం ఇంత వరకు చేపట్టలేదన్నారు. రైతుల వద్ద నుంచి ఎకరానికి రూ. 500 నుంచి రూ.600 వసూలు చేసి రైతులే కాలువల పూడికతీత పనులు చేపట్టుకోవాలని చెప్పటం కూటమి ప్రభుత్వ తీరుకు అద్దం పడుతోందన్నారు. మరో పక్క ఎకరానికి రూ.830 ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టాలని ప్రభుత్వం చెబుతోందని ఇంత భారం రైతుపై మోపటం దుర్మార్గమన్నారు. సకాలంలో సాగునీరు అందకపోతే భూములన్నీ చౌడుగా మారిపోయి రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులపై వ్యాఖ్యలు చేసే సమయాన్ని రైతుల గురించి ఆలోచించి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పొలాలకు నీరు అందించకపోతే తాము పోరాటానికి సిద్ధమని స్పష్టం చేశారు. మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, వైఎస్సార్ సీపీ సౌత్ మండలం అధ్యక్షులు గణేశన రమేష్, గడిదేశి రాజు, పలువురు రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో చిన్న కేసులు పరిష్కరించుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి అరుణ



అవనిగడ్డ కోర్టు ప్రాంగణంలో ర్యాలీలో జడ్జిలు అరుణ, స్వర్ణలత, న్యాయవాదులు

అవనిగడ్డ: మధ్యవర్తిత్వం ద్వారా చిన్న కేసులను పరిష్కారం చేసుకోవాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.అరుణ అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సోమవారం మండల న్యాయసేవాధికార కమిటీ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి అరుణ మాట్లాడుతూ చిన్న కేసుల పరిష్కారం ద్వారా సమయం, డబ్బులు ఆదా అవుతాయని చెప్పారు. ఈ విషయాన్ని కక్షిదారులకు అవగాహన కల్పించి ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి. స్వర్ణలత, ఏజీపీ నరహరశెట్టి ఈశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురామ ప్రసాద్, మధ్య వర్తిత్వ కమిటీ సభ్యులు ఈశ్వరరావు, తోట వీరబాబు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్న ప్రభుత్వం

సీపీఎం జిల్లా కార్యదర్శి నరసింహారావు

మచిలీపట్నంటౌన్: ప్రభుత్వ పెద్దలు ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా నిరర్థకమైన ఘర్షణ వాతావరణాలను సృష్టిస్తూ సమస్యలను పక్కదారి పట్టిస్తుండటం ఎంత వరకు సబబని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు ప్రశ్నించారు. ఆయన సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లాలో రైతులు సాగునీటి, యూరియా కొరత వెంటాడుతున్నా పరిష్కారానికి నోచటం లేదన్నారు. ఖరీఫ్ సాగు చేసే రైతులకు పెట్టుబడికి సంబంధించి రుణాలు అందటం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు ప్రజలకు భారంగా మారాయన్నారు. సాగుభూములు, ఇళ్ల స్థలాల సమస్య, ఇంటి పన్నుల భారం, టిడ్కో గృహాల కాలనీల సమస్యలు, జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పన వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రైతుల, ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు కొడాలి శర్మ, మాదాల వెంకటేశ్వరరావు, బూర సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అర్జీదారులకు మజ్జిగ పంపిణీ



చిలకలపూడి(మచిలీపట్నం): స్వచ్ఛ కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం అర్జీదారులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా డీఆర్వో కె.చంద్రశేఖరరావు పుట్టినరోజు సందర్భంగా సోమవారం మీకోసం కార్యక్రమానికి వచ్చే అర్జీదారుల కోసం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ డీకే బాలాజీ అర్జీదారులకు మజ్జిగ పంపిణీ చేసి ప్రారంభించారు. గిరిజన సంక్షేమాధికారి ఫణిదూర్జటి, స్వచ్ఛ కలెక్టరేట్ ప్రతినిధి తూము వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఆర్టోవోకు ఎమ్మెల్యే పరామర్శ

చల్లపల్లి: రిటైర్డ్ ఆర్డీవో నాదెళ్ళ శివరామకృష్ణను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం పరామర్శించారు. శివరామకృష్ణ మాతృమూర్తి తులసీరత్నం (102) ఇటీవల కన్నుమూశారు. తులసీ రత్నం చిత్రపటం వద్ద ఎమ్మెల్యే పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. వెంట పలువురు ఉన్నారు.

అంబులెన్స్ డ్రైవర్‌పై దాడి

కోనేరుసెంటర్: మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో అంబులెన్స్ డ్రైవర్‌పై ఇరువురు దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటనపై బాధితుడు మచిలీపట్నం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో ఓ వ్యక్తి మృతి చెందగా సదరు మృతదేహాన్ని కలకత్తా వరకు చేర్చాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో మృతుని కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న అంబులెన్స్‌ను కిరాయికి మాట్లాడగా అంబులెన్స్ డ్రైవర్ ఎక్కువ మొత్తంలో డిమాండ్ చేశాడు. అంత చెల్లించుకోలేని మృతుని కుటుంబ సభ్యులు ఆన్‌లైన్‌లో మరో అంబులెన్స్‌ను బుక్ చేసుకున్నారు.దీంతో విజయవాడ నుంచి బుక్ చేసుకున్న అంబులెన్స్ మచిలీపట్నం ఆసుపత్రికి చేరుకోగా స్థానిక అంబులెన్స్ డ్రైవర్లు ఇరువురు విజయవాడ నుంచి వచ్చిన అంబులెన్స్ డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డారు. అంబులెన్స్ అద్దాలను పగులగొట్టి దుర్భాషలాడారు. దీంతో బాధితుడు మచిలీపట్నం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు నిమిత్తం కోర్టుకు సిఫార్సు చేశామన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆలయ హుండీలో కానుకల లెక్కింపు

ఘంటసాల: స్థానిక బాలపార్వతీ సమేత శ్రీజలధీశ్వర స్వామి ఆలయంలోని కానుకల హుండీని సోమవారం లెక్కించగా రూ.2,44,135 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో యార్లగడ్డ వాసు తెలిపారు. బందరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు సమక్షంలో కానుకలను సిబ్బంది, గ్రామస్తులతో కలసి లెక్కించగా తొమ్మిది నెలలకు గాను రూ.2,44,135 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. సిబ్బంది నాగరాజు, అర్చక స్వాములు చావలి కృష్ణ కిషోర్, భక్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

పెడన: అగ్ని ప్రమాదంలో ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతూ ఒక వృద్ధురాలు మృతి చెందిన సంఘటన పెడన పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని దక్షిణ తెలుగుపాలెంకు చెందిన పిట్ట వెంకమ్మ (87) గత నెల 28వ తేదీన ఇంట్లో దోమల చక్రం వెలిగించి పడుకుంది. మంటలు అంటుకుని తీవ్రంగా గాయపడిన వెంకమ్మను మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. అవుట్ పోలీసుల సమాచారం, వెంకమ్మ కూతురు ముచ్చు రాజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేశారు.

షాపింగ్ కాంప్లెక్స్‌కు మరమ్మతులు చేపట్టాలి

మచిలీపట్నంటౌన్: స్థానిక కోనేరుసెంటర్‌లో 30 ఏళ్ల క్రితం నిర్మించిన మునిసిపల్ షాపుల నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవటంతో శిథిలావస్థకు చేరాయని, వాటికి తక్షణం మరమ్మతులు చేయించాలని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి సద్‌రుద్దీన్ ఖురేషి డిమాండ్ చేశారు. ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. షాపుల శ్లాబులు దెబ్బతిని పెచ్చులు ఊడిపోతున్నాయన్నారు. ఫలితంగా కొంత మంది షాపుల అద్దె దారులు మూసివేయాల్సివస్తోందన్నారు. కోనేరు సెంటర్‌లోని ఈ పట్టాభి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ద్వారా కార్పొరేషన్‌కు రూ.కోటి ఆదాయం వస్తుందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తక్షణం స్పందించి శిథిలావస్థలో ఉన్న షాపులకు మరమ్మతులు చేయించాలని కోరారు.